క్లుప్తంగా

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు వినోద్‌కుమార్

కొత్తపల్లి: గ్రామాలలో ప్రభుత్వం 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి వినోద్ కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు బీపీ, షుగర్, జ్వరం, ఒంటి నొప్పులు, ఇతర దీర్ఘకాలిక రోగాల పరీక్షలు పరీక్షించారు. అదేవిధంగా గర్భిణులకు రక్తపరీక్షలు, హీమోగ్లోబిన్ శాతం, బీపీ, షుగర్ వంటి సమస్యలు ఉన్నాయని తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రోగులందరికీ ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

రాయితీలను రైతులు ఉపయోగించుకోవాలి



కలెక్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు

నందికొట్కూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు సూచించారు. బుధవారం మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలోని శ్రీభ్రమరాంబా మల్లికార్జున రైతుసంఘం కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటలైన మిరప, ఉల్లి తదితర ఉత్పత్తులకు ప్రాసెసింగ్ చేపట్టాలని, ఇందుకు ప్రభుత్వం 35 శాతం రాయితీ అందిస్తుందని అన్నారు. ప్రాసెసింగ్‌కు రైతు సంఘాలు ముందుకు వస్తే ఒక్కో కలెక్షన్ సెంటర్‌కి 75 శాతం సబ్సిడీతో రూ.11.25 లక్షలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారిణి చందన, హరినాథ్ రెడ్డి, వీహెచ్‌ఏ మౌనిక, రైతులు పాల్గొన్నారు.

వైద్యురాలికి సన్మానం



వైద్యురాలిని సన్మానిస్తున్న వైద్యసిబ్బంది

కొత్తపల్లి: వైద్యశాస్త్రంలో ఉన్నత చదువుల (పీజీ. జనరల్ మెడిసిన్)పై వెళ్తున్న ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సౌజన్యలక్ష్మిని వైద్యసిబ్బంది, మండలంలోని ఆయా వైద్యశాలల డాక్టర్లు బుధవారం ఘనంగా సన్మానించారు. డాక్టర్ సౌజన్యలక్ష్మి మాట్లాడుతూ మారుమూల నల్లమల అటవీ ప్రాంతానికి అతిసమీపంలో, గిరిజన గూడెలలోని గిరిజనులకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలకు వైద్యసేలు అందించడం సంతృప్తి నిచ్చిందన్నారు. కార్యక్రమంలో వైద్యులు వినోద్‌కుమార్, విజయేంద్ర వర్మ, దీపానాగవేణి, జూబేద, వైద్యసిబ్బంది, 104, 108 సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల విరాళం



విరాళంగా అందజేసిన కుర్చీలతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు పది కుర్చీలను విరాళంగా అందజేసిన పూర్వ ఉపాధ్యాయుడు ఎల్లనాయుడును పాఠశాల సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం మధుసూదన్‌రావు మాట్లాడుతూ గతంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేసి గ్రామస్తుల మన్ననలు పొందిన ఎల్లనాయుడు పాఠశాల అభ్యున్నతిని కాంక్షించి రూ. 10 వేల విలువ చేసే కుర్చీలను విరాళంగా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్‌మియ్య, రామలింగేశ్వరరెడ్డి, రమణారావు, వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్, పీఈటీ రాగన్న, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి తదితరులు ఉన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

మహానంది: సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో ఆర్డినేటర్ ప్రసాద్ ఆదేశించారు. బుక్కాపురంలోని పొదుపు మహిళా సమాఖ్య భవనంలో బుధవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకల అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, సీసీలు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

జూపాడుబంగ్లా: వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో జూపాడుబంగ్లా మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాగిరెడ్డి, సైపుద్దీన్, నారాయణ, నాగన్న పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి మహర్దశ

- చరిత్రాత్మక దేవస్థానం జీర్ణోద్ధరణకు శ్రీకారం
- రూ.73 లక్షలు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మరో రూ.20 లక్షలు సమకూర్చుకున్న గ్రామస్తులు
- నేడు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేతులమీదుగా భూమిపూజ

ఆత్మకూరు: మండలంలోని అతిప్రాచీన దేవాలయం కృష్ణాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి మహర్దశ పట్టనుంది. ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయ జీర్ణోద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.73 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి భూమిపూజ చేసి నూతన ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన ఆలయం

ఒకప్పుడు అత్యంత వైభవంగా 24 గంటలూ ధూప దీప నైవేద్యాలు, బాజా భజంత్రీలు, మంగళహారతులతో వైభవంగా పూజలందుకున్న అత్యంత ప్రాచీన దేవాలయం కృష్ణాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం. దాదాపు 600 సంవత్సరాల క్రితం శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఈ దేవాలయం వెలిసింది. అప్పట్లో శ్రీకృష్ణదేవరాయలు శ్రీశైలమహాక్షేత్రానికి అశ్వాలు, గజ బలంతో వెళ్లే సమయంలో కృష్ణాపురం ప్రాంతంలో సేద తీరుతూ.. ఇక్కడ శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవాలయం నిర్మిస్తే బాగుంటుందని భావించి.. అత్యంత వైభవంగా దేవాలయం నిర్మించడమే కాకుండా వందల ఎకరాల భూమిని ధారాదత్తం చేశారు. ప్రస్తుతం ఈ ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో స్థానిక గ్రామస్తులు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో దేవాలయం నూతన శోభకు నాందిపలికింది.





వేంకటేశ్వరస్వామి ఆలయం (ఇన్‌సెట్) మూల విగ్రహం

ఎమ్మెల్యే చొరవతో నిధుల విడుదల

శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని పునరుద్ధరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే శిల్పా దృష్టికి తీసుకువెళ్లడంతో ఆలయ ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు వివరించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రూ.73 లక్షలు మంజూరు చేయడమే కాకుండా వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులకు తోడు గ్రామస్తులు రూ.20లక్షలు సమకూర్చుకోవడంతో పునర్నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. నూతన దేవాలయాన్ని అధునాతన పద్ధతిలో నిర్మించనున్నారు.

దేవాలయానికి అత్యంత ప్రాచీన చరిత్ర



మా గ్రామంలో ఈ దేవాలయానికి అత్యంత ప్రాచీన చరిత్ర ఉంది. వందల ఏళ్ల క్రితం ఆలయాన్ని నిర్మించారు. వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సమీపంలో ఉన్న గ్రామాలన్నీ 'పురం' అన్న పేరుతో వెలిశాయి. మా గ్రామం కృష్ణాపురం, తూర్పువైపు వెంకటాపురం, పడమట అమలాపురం, దక్షిణం సిద్ధాపురం, ఉత్తరం రాధాపురం గ్రామాల ప్రజలు నిత్యం స్వామివారి దర్శనానికి తరలివచ్చి పూజలు చేసే వారు. ఆలయ జీర్ణోద్ధరణ చేపడతున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డికి కృతజ్ఞతలు. – లక్ష్మిరెడ్డి, కృష్ణాపురం

ఎమ్మెల్యే, సీఎం చొరవతోనే సాధ్యమైంది



మా గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని నూతన అధునాతన పద్ధతిలో నిర్మించనున్నారు. దేవాలయాన్ని పునర్నిమించాలని భావిస్తున్నప్పటికీ చివరికి ఎమ్మెల్యే కృషితో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో లక్షలాది రూపాయలు మంజూరయ్యాయి. ఆలయ నిర్మాణం ప్రారంభం కావడం ఎంతో శుభపరిణామం. –రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ, కృష్ణాపురం

దేవాలయాన్ని అత్యాధునీకరంగా నిర్మిస్తాం

ఆత్మకూరు మండలమే కాకుండా జిల్లాలోని వందల ఎకరాల భూములు కలిసిన ఏకైక దేవాలయం కృష్ణాపురంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం. ఈ దేవాలయానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.70 లక్షలు మంజూరు చేసింది. అత్యాధునికంగా ఈ దేవాలయం నిర్మిస్తాం. ఈ నిధులు సరిపోక పోతే ఇంకా దేవదాయశాఖ కు నిధుల మంజూరు పై ప్రతిపాదనలు పంపుతాం.

– కార్తిక్ , దేవస్థానం ఈఓ, ఆత్మకూరు

సాక్షిగణపతికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతోనూ, ఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్ర స్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

సమావేశానికి హాజరుకావాలి

పాములపాడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించనున్న సమావేశానికి కేజీ రహదారి, ఆర్అండ్‌బీ రహదారులకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, ఇళ్ల యజమానులు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ గోపీకృష్ణ బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ హుస్సేన్ బాషా

కొత్తపల్లి: విద్యార్థులు, యువతన సన్మార్గంలో నడవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎంపీడీఓ మేరి, ఎస్‌ఐ హుస్సేన్‌బాషా సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.దినేష్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాఠశాలల విద్యార్థులకు 'డ్రగ్స్ వద్దురా.. జీవితం ముద్దురా' అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ యువత సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఎక్కువగా అలవాటుపడుతున్నారని, యువత చెడు అలవాట్లకు బానిసలై మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, పాఠశాల హెచ్‌ఎం పీ.వీ.సుబ్బారెడ్డి, ఏఎస్‌ఐ బాబాఫక్రుద్దీన్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రేమ్ సాయి, లింగేష్, గంగాధర్, శివమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేయాలి

జూపాడుబంగ్లా: విద్యార్థుల్లో ప్రతిభా సామర్థ్యాన్ని పెంచేలా ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి సూచించారు. మండలంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషన్ అసెస్మెంట్ ప్రాక్టికల్ పరీక్షను గురువారం ఎంఈఓ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవ తనిఖీ చేశారు. ఈనెల 3న కేంద్ర ప్రభుత్వం అధ్వర్యంలో 3, 6, 9 తరగతులకు చెందిన విద్యార్థులకు గణితం, ఆంగ్లమ పాఠ్యాంశాలలో స్టేట్ ఎడ్యుకేషన్ అసెస్మెంట్ సర్వే టెస్టును నిర్వహించనున్నారు. అందులో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన ప్రాక్టీసు టెస్టు విధానాన్ని, విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను పరిశీలించారు.

పగిడ్యాల: స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎస్ఈఏఎస్ మోడల్ ప్రాక్టీస్ పరీక్షను మండల విద్యాధికారి సుభాన్ పరిశీలించారు.

నందికొట్కూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కోట) హైస్కూల్‌ను ఎంపీడీఓ శోభరాణి తనిఖీ చేశారు. స్టేట్ ఎడ్యూకేషన్ అసిస్మెంట్ సర్వే ప్రాక్టీస్ టెస్టల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పాములపాడు:మండలంలోని ఇస్కాల ఎంపీయూపీ స్కూలు, మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ జెడ్పీహెచ్ స్కూళ్లను ఎంపీడీఓ గోపీకృష్ణ తనిఖీ చేశారు.

ఈ-టాయిలెట్స్ స్థలంలో షాపులు నిర్మించొద్దు



ఈ-టాయిలెట్స్ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేయవద్దని ధర్నా చేస్తున్న వ్యాపారులు

శ్రీశైలం: ఈ-టాయిలెట్స్ స్థలంలో కొత్తషాపులను నిర్మించొద్దని లలితాబజార్‌లోని వ్యాపారులు ఆందోళనకు దిగారు. శ్రీశైలదేవస్థానం పరిధిలోని లలితాబజార్‌లోని జె, కె, ఎల్ కాంప్లెక్స్ మధ్యలో నిర్మించిన ఈ-టాయిలెట్స్ తొలగింపు పనులు బుధవారం ప్రారంభించడంతో వ్యాపారులు ఆ స్థలంలో కొత్తషాపులను నిర్మిస్థారనే ఉద్దేశంతో ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న దేవస్థానం రెవెన్యూ సహాయ కార్యనిర్వాహణాధికారి ఫణీధర ప్రసాద్, రెవెన్యూ సిబ్బందితో కలిసి షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. దేవస్థానం పరువు ప్రతిష్టలు బజారుకీడ్చకుండా ఆఫీస్‌లో సమావేశమవుదామని నచ్చజెప్పారు. దీంతో దేవస్థానం ఆఫీస్‌లో ఏఈఓ, ఈఈ రామకృష్ణలు వ్యాపారస్తులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఉన్న ఈ-టాయిలెట్స్‌ను భక్తుల అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తొలగిస్తున్నామని, వాటిని వేరే చోట ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. దీంతో వ్యాపారస్తులు ఈ-టాయిలెట్స్, చెట్లను తొలగించాక ఆ ప్రదేశంలో తిరిగి షాపుల నిర్మాణం చేయబోమని హామీ ఇవ్వాల్సిందిగా దేవస్థానం అధికారులను కోరారు. ఈ విషయంపై ఈఓ తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి

పాములపాడు: పార్టీ కోసం శ్రమించే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే అంశంపై ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం ప్రజల అభివృద్ధికి దోహదపడేదేనన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు దరి చేరుతున్నాయని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చౌడయ్య, జేసీఎస్ కన్వీనర్ నాగరాజు, మద్దూరు సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ రమణారెడ్డి, సర్పంచులు రామస్వామి, కోట్ల చంద్రారెడ్డి, వరప్రసాద్, చింతల నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పేకాట రాయుళ్ల అరెస్టు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామానికి చెందిన ముగ్గురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ బుధవారం రాత్రి తెలిపారు. గ్రామానికి చెందిన బోయ దర్గయ్య, బోయ వెంకటశివుడు, తెలుగు అశోక్ గ్రామ శివారులో పేకాట ఆడున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ సిబ్బందితో వెళ్లి దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,240 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నల్లమల ఘాట్‌లో తప్పిన ముప్పు

మహానంది: నంద్యాల, ప్రకాశం జిల్లాల సరిహద్దులను కలుపుతూ ఉన్న నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో బస్సు, లారీ ఢీకొన్న సంఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. గాజులపల్లె నుంచి గిద్దలూరు వెళ్లే మార్గంలోని చింతమాను టర్నింగ్ మలుపుల వద్ద ఎదురెదురుగా వస్తున్న ప్రైవేటు బస్సు, లారీ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. రెండు వాహనాల ముందు భాగాలు దెబ్బతిన్నాయి.

13 మందిపై బైండోవర్ కేసులు

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం, బసవాపురం, బుక్కాపురం గ్రామాలకు చెందిన 13 మందిపై బుధవారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు, గతంలో అల్లర్లకు పాల్పడిన వారిపై నిఘా ఉంచామన్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

మూడు టిప్పర్లు సీజ్

జూపాడుబంగ్లా: ఎలాంటి భద్రత, సరైన పత్రాల్లేకుండా అధికలోడుతో ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లను ఎస్‌ఐ మారుతిశంకర్ సీజ్ చేశారు. గురువారం కర్నూలు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న మూడు టిప్పర్లును ఎస్‌ఐ గమనించారు. పత్రాలను పరిశీలించగా సక్రమంగా లేకపోవడంతో వెంటనే స్వాధీనం చేసుకున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



బాధితులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: మండలంలోని శ్రీపతిరావు పేట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో నష్ట పోయిన బాధిత కుటుంబాలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పరామర్శించారు. ఈ సంఘటనలో ప్రభాకర్‌రెడ్డికి చెందిన పాడి గేదెలు, ఎద్దు, దూడలు, షెడ్ వంట సామగ్రి సర్వం కాలిపోవడంతో ఎమ్మెల్యే చలించిపోయారు. రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. అలాగే ప్రమాదంలో సుబ్బమ్మ, లక్ష్మీదేవిల షెడ్లు కాలిపోవడంతో వారికి ఒక్కొక్కరికి రూ.5 వేలు నగదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం అందించడమే కాకుండా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు అందేలా కృషి చేస్తానన్నారు. ఆర్డీఓ దాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా రావాల్సిన నిధులు సహకారానికి పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపుతామని చెప్పారు. గ్రామసర్పంచ్ వాణి పుల్లారెడ్డి, శంకరయ్య, రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజు, లక్ష్మిరెడ్డి, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, ఇందిరేశ్వరం సర్పంచ్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాముల చిత్రపటానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని నూతనంగా నిర్మిస్తున్న షాదీఖానా పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. త్వరలోనే నిర్మాణం పనులు పూర్తి కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామి యాదవ్, వెంకటస్వామి గౌడ్, బైరాపురం షేక్ మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

వెలుగోడు: ఖరీఫ్‌లో పంటలకు ఆయకట్టు రైతులు వారాబందీ పద్ధతిలో నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలుగు గంగ ఈఈ వెంకటేశ్వర్లు శెట్టి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల కారణంగా శ్రీశైలం జలాశయానికి నీరు పూర్తి స్థాయిలో చేరలేదని, రాయలసీమలోని జలాశయాలకు కావలసిన సరఫరా కాలేదన్నారు. సిద్ధాపురం చెరువు కింద రైతులు రెండో పంట వేసుకోవద్దని, ప్రస్తుతం చెరువులో ఉన్న నీరు ఖరీఫ్ పంటలకు సరిపోతుందన్నారు. రైతులు నీటి నియంత్రణకు సహకరించాలని ఈఈ కోరారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

శ్రీశైలంప్రాజెక్ట్: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను బుధవారం శ్రీశైలం ప్రాజెక్ట్‌కాలనీలో ఘనంగా నిర్వహించారు. పోలేరమ్మ గుడి వద్ద నుంచి వాల్మికి చిత్రపటంతో రామాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.వాల్మికి చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు సమర్పించి, నివాళులర్పించారు. రామాలయంలో స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ డా.బి రవీంద్రారెడ్డి, తహసీల్దార్ రాజేంద్రసింగ్, వాల్మీకి సంఘం నాయకులు ఎం కోటేశ్వరరావు , టి. నారాయణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

మహానంది: ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రో త్సాహం అందిస్తుందని బండిఆత్మకూరు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. మండల పరిధిలోని నారపురెడ్డికుంటలో కొబ్బరి, మామిడి మొక్కల పెంపకాన్ని బుధవారం పరిశీలించారు. అంతకు ముందు నారాయణాపురం, చిన్నదేవళాపురం గ్రామాల్లో ఎంఈఓ యశోధ, ఈఓఆర్‌డీ శ్రీనివాసులుతో కలిసి ఎస్ఈఏఎస్ పరీక్షల ఏర్పాట్లు, మధ్యాహ్న భోజనం అమలుపై తనిఖీలు నిర్వహించి పలు సూచనలు చేశారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి



స్టాల్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. పట్టణంలోని కొత్తపేట సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు శ్రీరామరక్ష అన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు రషీద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ గౌస్‌లాజం, షంషూర్, షాలుపైల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పొద్దున్నే పింఛన్ల పంపిణీ



భాస్కరాపురంలో తెల్లవారుజామున పింఛన్ అందజేస్తున్న వలంటీరు సుభాషిణి

మహానంది: తెలవారకముందే వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. మహానంది మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ జరిగినట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. మహానంది మండలంలో మొత్తం 5,338 పింఛన్లలో తొలి రోజు 75.85శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. బండిఆత్మకూరు మండలంలో 6,689 ఉండగా 52.65 శా తం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు.

రాత్రి వేళలోనూ పంపిణీ..

పగిడ్యాల: ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వలంటీర్ల రాత్రి వేళలో కూడా సామాజిక పింఛన్‌లను పంపిణీ చేసి ప్రశంసలు అందుకుంటున్నారు. బుధవారం వలంటీర్లు తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పింఛన్‌లను పంపిణీ చేశారు. మొదటి రోజు 90 శాతం పైగా పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు.

జూపాడుబంగ్లాలో 55.79శాతం

జూపాడుబంగ్లా: నవంబర్ నెల పింఛన్ల పంపిణీ బుధవారం తెల్లవారుజామునే ప్రారంభం కాగా మండలంవ్యా ప్తంగా 55.79 శాతం పంపిణీ పూర్తైనట్లు ఎంపీడీఓ సూర్జహాన్ తెలిపారు. మండలానికి 5,123 పింఛన్లు మంజూరు కాగా సాయంత్రం 5గంటల్లోగా వలంటీర్లు 2,858 మందికి నగదు అందజేసి 55.79 శాతం పంపిణీ చేసినట్లు వెల్లడించారు.



గాజులపల్లెలో సుబ్బలక్ష్మమ్మకు పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ లింగమయ్య

పొట్టిశ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న చైర్మన్ సుధాకరరెడ్డి, ఆర్యవైశ్యులు

నందికొట్కూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరసమ్మరణీయమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ చైర్మన్‌తో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు నివాళులర్పించారు. పట్టణంలోని ఆయా పాఠశాలలో పొట్టి శ్రీరాములు విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్యవైశ్య సంఘం నాయకు లు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు.చైర్మన్ మాట్లాడుతూ..తెలుగు దేశం పాలనలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో వేడుకలు పునఃప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు రూపాదేవి, హమీద్, సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివప్రసాద్, శ్రీకాంత్, రజినీకుమార్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, సభ్యులు నాగేశ్వరరావు, వీ.ఆర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు పొట్టి శ్రీరాములు

వెలుగోడు: ప్రత్యేక రాష్ట్రం, మద్యపాన నిషేధం, హరిజనుల ఆలయ ప్రవేశం, జైళ్ల సంస్కరణల కోసం జీవితాంతం పోరాడిన పోరాట యోధుడు అమరజీవి పొట్టి శ్రీరాములని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. సెంటర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సరస్వతీ శిశు మందిర్‌లో మాజీ ఎంపీపీ సీతామహాలక్ష్మమ్మ, కమిటీ సభ్యులు రాఘవయ్య, శివశంకర్‌రెడ్డి, బీవీ బాలయ్య, రామచంద్రారెడ్డి పొట్టి శ్రీరాములు, తెలుగు తల్లి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వేల్పుల జయపాల్, జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి బుధవారం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో పీఓ రవీంద్రారెడ్డి, ఏపీఓ ఎ.సురేష్‌కుమార్, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డా.పి హుస్సేన్‌బాషా, అధ్యాపకులు నివాళులర్పించారు. అనంతరం పొట్టిశ్రీరాములు త్యాగనిరతిని కొనియాడారు.

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని వాసవి నిత్యాన్నదానసత్రంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం చైర్మన్ అయితా మార్కండేయులు ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం, పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయ న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



వెలుగోడులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐటీడీఏ అధికారులు